# చల్లారిన సంసారాలు

ఆర్. యం. చిదంబరం

**కథానిక**

నేనూ మా తమ్ముడూ ఊళ్లోవున్న ఇంత పెద్ద వానర సైన్యాన్ని కాలదన్ని, పాపని, అతని తమ్ముడు రామాన్ని అమితంగా ఆదరించేవాళ్ళ మంటే అందుకు కారణం లేకపోలేదు. లక్ష్మణుడు గీసిన గీటను సీతన్నా అతిక్రమించింది కాని పాప, రామం మాత్రం మా ఆజ్ఞను భరతుడు పాదుకల్ని ఎంత శ్రద్ధగా నెత్తిన మోసుకుపోయాడో అంత వినయంతోనూ శిరసావహిస్తారు. మేం ఏ ఆట ఆడమంటే అందుకు సిద్ధం.

"ఛట్ ...చక్రం ఆటొద్దు. క్రికెట్ ఆడుదాం" అనంగానే మూడు వెదురుబద్దలు పాతేసి మరో లావుపాటి వెదురుకర్ర బ్యాట్‌కింద పట్టుకుని పొజిషన్‌లో నిలబడితే మా తమ్ముడు టెన్నిస్ బంతి పుచ్చుకుని ఆటకు నాందీవాక్యం పలికేవాడు. ఆఖరుకు వీధంటుపోతున్న గ్రామసింహాన్ని చూపించి "ఇది పిల్లి" అనమంటే అనేస్తారు.

"అప్పుడే నాలుగున్నరైంది. బడివదిలేసి అరగంటైంది. ఇంకా రాలేదారా వాళ్ళు?" అంటూ తమ్ముడు విసుగ్గా బంతి నేలనేసి కొట్టాడు.

"కాఫీ తాగుతున్నారుగామోలు!" అని సమాధానం చెప్పాను.

"వాళ్ళమ్మే మంచిది. బళ్లోంచిరాగానే కాఫీ సిద్ధంగా వుంచుతుంది" అని తమ్ముడిద్దరు మాతృశ్రీలను పోలుస్తుంటే నిజమేననిపించింది.

"నాన్నకు అప్పటికప్పుడు కాఫీ కాచివ్వాలి-అందుకని నాన్నవచ్చేదాకా ఆగాలిట... మరి వాళ్ళ నాన్న లేడుగా!"

"కాఫీకి రారేమ్రా!" అన్న అమ్మ పిలుపు వంటింట్లోంచి మూడుగదుల్ని ఛీల్చుకుని మా చెవిని పడిందంటే అమ్మకు రైలింజనుకున్నంత గొంతుక వుండివుండాలి.

ఇద్దరం లోపలికి పరుగెత్తాం. తమ్ముడు గ్లాసు ఖాళీచేశాక కాఫీ విషయంలో తనకంటె వాళ్ళ పాప. రామం అదృష్టవంతులని రిమార్కు చేశాడు.

"ఏడిశావ్!...వాళ్ళకసలు కాఫీ అలవాటే లేదు. ఇవన్నీ మీకే పట్టుకున్నాయ్. మాకలవాటైంది, తప్పదు. మీకూ ఎందుకు? ఎముకలు గుల్లైపోతాయి" అంది అమ్మ.

"అమ్మ అబద్ధమాడుతూందిరా తమ్ముడూ! ...వాళ్ళు పొద్దున్న-సాయంత్రం తాగుతూంటే."

"అవన్నీ పైపైమాటలు! పాపం! వాళ్లు కాఫీకూడా ఎక్కడతాగుతారు?" నిట్టూర్చిందమ్మ.

ఇద్దరం ఒకరి మొహాలొకరం చూసుకున్నాం. పాప-రామం పిలుస్తున్నారు. బయటికిపరుగెత్తాం.

మాకుపట్టుకున్న సందేహాల్లో మరొకటి— వాళ్ళు స్తమానంమాసినబట్టలెందుకు కట్టుకుంటారు? చిరిగినవికూడా కట్టుకుంటారు. ఎందుకని? ఓగంట 'చక్రం ఆట' ఆడి అలసిపోయి అరుగుమీద కూర్చున్నాం? నాన్న అరుగుమూల కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు.

'ఒరే పాపా! మీరెప్పుడూ అలా బొగ్గుల్లాంటి బట్టలు కట్టుకుంటారేమ్రా? మంచిబట్టలు కట్టుకోవాలని మేష్టారు చెప్పలేదూ?.. ఓనాడు మిమ్మల్ని చీవాట్లుకూడా వేశారు. మర్చిపోయూరా?' అనడిగాడు తమ్ముడు. పిడుగు తలమీద పడ్డట్లు ఇద్దరి ముఖాలూ ముడుచుకుపోయాయి. పాప తనలాగుకేసి-తమ్ముడిలాగుకేసి చూసుకున్నాడు. బాగా మాసిపోయాయ్. రూపాయంత ప్యాచీలుకూడా వున్నాయ్...హఠాత్తుగా ఎందుకో నాన్నకేసి చూశాను. కళ్ళజోడులోంచి రెండు కనుగొలకుల్లోను రెండు కన్నీటిచుక్కలు కనిపించాయి.

'మంచిబట్టలేసుకుంటే చిటికలో మాసిపోతాయి. అందుకే ఇవి వేసుకుంటాం. మా ఇంట్లో పెట్టెలో మంచిబట్టలున్నాయి, సిల్కు-చొక్కా కూడా వుందట. మా అమ్మ చెప్పింది. అవి పండక్కి వేసుకుంటాం' అన్నాడు పాప. అతని మాటలు యదార్థమన్నట్టు చూశాడు రామం.

పోవటానికి ఉబికివస్తున్న శోకమే కారణమనుకున్నాం.

అమ్మ గాజు పుచ్చుకుంది. "అయ్యో! నా దగ్గర దమ్మిడీలేదు. అడుగుతుంటే ఎలా లేదనను"

ఆమె ముఖం వెలవెలపోయింది.

"రేపొద్దున్న రండి. మావారితో చెప్పి ఎక్కణ్ణుంచైనా తెమ్మంటాను. ఎలాగైనా మీకు సాయంచేసి తీరుతాను. మీవారు ఉత్తరాలు రాస్తున్నారా?"

"లేదండి. రెండు నెల్లకితం వచ్చిందే! మొన్ననే పాపచేత రాయించాను. మీ రుణం ఎలా తీర్చుకుంటానో!"

"ఒరేపాపా! పూర్తిగా తడిసిపోతున్నావురా ఆ మూలకుపోదాంరా బాబూ! అంటున్నాడు రామం.

"మీ ఇంటో వాన కురుస్తుంటే ఇక్కడకు రాకూడదూ? పిల్లలకు జలుబు చేస్తే బాధ" అనమ్మ అంటోంటే పక్కింటి సంభాషణలు అమ్మకూడా వింటోందనుకున్నాను.

తులిసెమ్మ వెళ్ళిపోయిన పదినిమిషాలకు పాప రామం మాయింటికొచ్చి పడుకున్నారు.

"ఎలాగయినా సరే-ఎవరన్నా అడిగి ఆ పది రూపాయిలు తీసుకొస్తాను. ఆ పిల్లల్ని చూస్తూ ఉంటే నాకడుపు తరుక్కుపోతోంది. ఆ గాజు ఎందుకు? అవిచ్చేయ్! వాళ్ళ నాన్న ఎప్పుడో స్తాడో కదా!" అని నాన్న మెల్లిగా అమ్మతో అంటుంటే నాన్న మేమనుకున్నంత చెడ్డవాడు కాదనుకున్నాం.

వాళ్ళ నాన్నను సుమారు ఆర్నెళ్ళక్రితం చూశాం. పాప, రామం వచ్చి ఆర్నెళ్ళైఅయింది. సన్నంగా చీపురు పుల్లలావున్నాడు. సైన్సు పుస్తకంలో మనుష్యుడిఅస్థిపంజరంజ్ఞాపకానికొచ్చింది. పిల్లలకు ఓ బత్తాయి పండు బహుమతితెచ్చాడు. అతను తేగలిగిందంతే గాబోలు! అంతే - మళ్ళీ రాలేదు. వాళ్ళ నాన్ననుగురించి చాలాసొగ్గడు గుదాకునుకున్నాం. కాని అమ్మ కోప్పడుతుందని ఊరుకున్నాం. వాళ్ళిద్దరూ సాయంత్రం తోడు క్కున్నలాగులే తొడుక్కున్నారు. వాళ్ళిద్దరూ అప్పుడే నిద్రపోయారు!

మర్నాడు పదింటిదాకా ఆకాశం మేగులు తెగినట్లు వానకురుస్తూంది. పాప, రామం ఆరింటికే లేచి వెళ్ళిపోయారు. అంత ఉదయాన్నే లేచే అలవాటు మాకు లేకపోయినందుకు సిగ్గుపడిపోయాం

ఏడున్నరైంది. తమ్ముడు కాగితపు పడవలు వదులుతుంటే చూస్తున్నా-తులిసెమ్మ వచ్చింది.

"మీ నాన్నగారు ఉన్నారా?" అనడిగింది. ఉన్నారనితలూపి లోపలికిపోయి నాన్ననుపిలుచుకొచ్చాను.

"ఈ టెలిగ్రామేమిటో చూడండి! ఇప్పుడే వచ్చింది." అంది. ఆమెచేతులు వణకటం చూస్తే మాకు భయమేసింది. తమ్ముడు నాన్నదగ్గరకొచ్చి నిలబడ్డాడు.

నాన్న టెలిగ్రాం విప్పి చదువుకున్నాడు.

"మీఆయనకు సీరియస్‌గా వుందిట... వెంటనే రమ్మని టెలిగ్రాం ఇచ్చారు."

వెలవెల పోతున్న ముఖంతో నిలుచుండిపోయింది.

"ఏ వూరు నుంచి వచ్చింది?"

"మెడ్రాసు... మౌంట్‌రోడ్..."

"అయితే పాతఇంట్లోనే నన్నమాట" అంటూ గబగబా లోపలికి వెళ్ళింది. మేమూ పరుగెత్తాం.

"మరేం భయపడకండి. అంతా మంచిగానే అవుతుంది. అరె! అలాఏడుస్తారేం? ఇప్పుడేం ములిగింది? చూడండి! పిల్లలెలా దిగులుగా వున్నారో" అంటూ అమ్మ ఓదార్చింది. నాన్న ఇరవై రూపాయిలు పట్టుకొచ్చిచ్చాడు. గాజుకూడా తిరిగిచ్చేశాడు. నేనూ తమ్ముడూ స్టేషనుకు వెళ్ళాం. రామం ఊరికే ఏడుస్తున్నాడు.

"ఒరే! రామం! ఏడవకురా! మీ నాన్నకేం ఫర్వాలేదని మా అమ్మచెప్పింది. అంతా తగ్గిపోతుంకట..." అని సముదాయిచాను.

రైలుబండి నల్లటి పొగల్ని చిమ్ముకుంటూ పోతుంటే మా గుండెల్లోకూడా చీకటి అలముకుంది. మాకూ ఏడవాలనిపించింది.

వారంరోజులు గడచిపోయాయి. ప్రపంచంలో పున్న దిగులంతా మాదగ్గరే వుండిపోయింది. ఎవరితోనూ ఆడ బుద్ధివేసేదికాదు. మాలో మేమే పిచ్చిగా ఆలోచించుకుంటూ కాలంగడిపాం.

ఈ వారం గడిచాక తులిసెమ్మ తిరిగొచ్చింది. కూడా రామంలేడు. పాపమాత్రమే వున్నాడు.

తిన్నగా మా యింటికే వచ్చింది. ఎంతసేపు ఏడ్చిందో, గడియారానిక్కూడా విసుగెత్తి గంట కొట్టింది. ఆమె ఏడుస్తూ మధ్యమధ్య అన్న ముక్కలవల్ల తెలిసిందిది: తెలిసెమ్మ వెళ్ళేసరికి అతను సగంప్రాణం వదలుకున్నాడట. ఆఖరు చూపు దక్కిందట. పిల్లల్నిద్దర్నీ శ్రద్ధగా చూడమని. తనామెకు దమ్మిడీ కూడా పంపలేక పోయానని తన పొట్టకోసం తనుపడ్డ శ్రమలే తిన్నగా ఫలించలేదని అస్పష్టంగా గొణిగి కన్ను మూశాడట.

"మీ రామం ఏడీ?"

ఇది అమ్మ వందోసారి అడగటం.

"ఆ పట్నంలో వాడు తప్పిపోయాడు. ఈ ఆరు రోజులూ వాడిని వెతుకుతూ తిరిగాం... ఏంచెప్పను తల్లోయ్! నా కొంప మునిగింది నా బిడ్డ దొరకలేదు! అంతా సర్వనాశనమైంది..." అని మొత్తుకు ఏడ్చింది. అమ్మ కళ్ళంట కూడా నీళ్ళు జలజల రాలాయి. శోకసాగరం ప్రవహిస్తూనే వుంది.

"రామం ఇంక కనిపించడంటావా పాపా!" అనడిగాడు తమ్ముడు.

పాప సమాధానంగా హోరున ఏడ్చేశాడు.

"అమ్మ పోలీసులకు చెప్పింది. కనిపిస్తాడో లేదో! రామం!"

అతనితోపాటు మేమూ ఏడ్చాం-అంతకంటే చేయగలిగిందేముంది?

మరో వారంరోజులకు తులిసెమ్మ పాపను తీసుకుని ఎక్కడికో వెళ్ళిపోయింది. మద్రాసుకు వెడుతున్నానని అంది కాని అమ్మమాత్రం అది నమ్మటానికి వీల్లేదంది. పాప రైలెక్కుతూ 'నన్ను మరచిపోకండే!...మా రామం నేనూ కలిసి మళ్ళీవస్తాం... టెన్నిసుబంతి పారేకండి... మన క్రికెట్టుబ్యాటు వీధరుగుమూలన పెట్టాను... జాగ్రత్త' అన్నాడు.

బండి కదిలిపోయింది.

---

# సమతా!

—"బైరాగి"

సమతా! ఓ సమతా!
జనతాహృన్నీరజ రజ మధుమమతా!
జీవితసైకత పథాన అమృతనిర్ఝరం నీవు
నీ నిర్ణిత ప్రవహానాన కలుషానికి లేదు తావు
సంతతవాసంతికవో అరుణలతా!
సమతా! ఓ సమతా!

నీ కలకలరవమే అది విప్లవ శంఖధ్వానం
కోటికోటి కంఠాల్లో మార్మ్రోగే నీ గానం
ఓ అగణిత సబలబాహు సక్షమతా!
సమతా! ఓ సమతా!

రుధిరారుణ మదిరగీతి నీ యుగాంతస్వనదశాంతి
ఉదయారుణ మధువిభూతి నీ నిశాంత సదయకాంతి
రాగోజ్జ్వలప్రత్యూషాంకురమహితా!
సమతా! ఓ సమతా!

ప్రాతస్సాగరతటాన తరుణారుణ పాటలమై
పాటల దళసంపుటాన హిమకణ ముక్తాఫలమై
జనసాగరహృదయోద్గతశ్రీదుహితా!
సమతా! ఓ సమతా!